క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ రూ.500కు అందిస్తాం



బాన్సువాడ రూరల్: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని ఆ పార్టీ కిసాన్ ఖేత్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉద్దర హన్మాండ్లు అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి జక్కల్‌దాని తండాలో పర్యటించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ సర్పంచ్ శాంతారూప్‌సింగ్ అన్నారు. నాయకులు గణేష్, వెంకట్‌రెడ్డి, బండి సాయిలు, సతీష్‌గౌడ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజాంసాగర్(జుక్కల్): ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన మహాపాదయాత్ర పోస్టర్లను శనివారం బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం వద్ద అవిష్కరించారు. శ్రావణ మాసంలో ప్రతీ ఏటా ఆఖరి శనివారం రోజున అంజనేయ స్వామి ఆలయ దర్శనానికి మహాపాదయాత్ర చేపడుతున్నారు. అందులో భాగంగా ఈ సారి అంజనాద్రి ఆలయం నుంచి ఎంపల్లి హనుమాన్ ఆలయం వరకు పాదయాత్ర కొనసాగిస్తామని ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిశోర్ కుమార్ తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బస్సు సదుపాయం లేని గ్రామాలకు తప్పనిసరిగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు కోరారు. ఇటీవల కామారెడ్డి ఆర్టీసీ డిపోకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎం ఇందిరను కలిసి ఆయన పుష్ప గుచ్ఛం అందజేశారు. ఆర్టీసీ ఆదాయం పెంపొందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు రాములు, రమేశ్, దత్తాద్రి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బైక్‌పై వెళ్తున్న వారికి సదాశివనగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గులాబీ పూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ...ప్రతి రోజు వాహనం నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల తమ కుటుంబాలను కాపాడుకోవడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. హెడ్‌కానిస్టేబుల్ సాయిలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ

బీబీపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పథకంలో భాగంగా శనివారం మండలంలోని ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో మండల పశువైద్యులు హేమశ్రీ ఆధ్వర్యంలో గొర్రెలను పంపిణీ చేశారు. ఉప్పర్‌పల్లిలో ఆరు యూనిట్లు, ఇస్సానగర్‌లో ఆరు యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

భూమిపూజ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బూర్గుల్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శనివారం బీఆర్ఎస్ నాయకులు భూమిపూజ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కింద రూ. 10 లక్షలు మంజూరు కావడంతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ నాయకులు దఫేదార్ విజయ్, లింగాల రాంచందర్, పుప్పాల విఠల్, తదితరులు ఉన్నారు.

ఆడపిల్లలకు అండగా కల్యాణలక్ష్మి



పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..ఆడపిల్లలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకాలను బీఆర్ఎస్ ప్రవేశపెట్టిందని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు ప్రక్రియలో జాప్యం

- యాభై శాతానికి మించని వైనం
- క్రాప్ బుకింగ్‌కు ఈ నెల 8 వరకు గడువు

నిజాంసాగర్(జుక్కల్): వానాకాలం పంటల సాగు నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. నిన్న, మొన్నటి వ్యవసాయ గణన ప్రక్రియలో వ్యవసాయశాఖ అధికారులు బీజీగా ఉండటంతో క్రాప్ బుకింగ్ ఆలస్యమైంది.

జిల్లాలో వానాకాలం పంటల సాగు పనులు దాదాపు పూర్తయినప్పటికి పంటల నమోదు ప్రక్రియ 50 శాతానికి మించ లేదు. జిల్లాలో 4.73 లక్షల ఎకరాల్లో రైతులు పంటల సాగు చేయగా ఇప్పటి వరకు 2.35 లక్షల ఎకరాల్లో పండిస్తున్న పంటలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఒక్కొక్క క్లస్టర్ వారీగా ఉన్న ఏఈవోలు 5 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్న పంటల నమోదు చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పట్టా భూములు, సర్వే నంబర్ల వారీగా రైతులు సాగు చేస్తున్న పంటలను ఆన్‌లైన్ చేస్తున్నారు. గ్రామాల వారీగా పంటల సాగు పూర్తయి నెల రోజులు కావస్తుంది. కానీ ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరుగుతోంది. అయితే క్లస్టర్ల వారీగా ఉన్న ఏఈవోలు, మండలాల వారీగా ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయగణనపై దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో పంటల నమోదు ప్రక్రియ ఆలస్యానికి కారణమైంది. కాగా వ్యవసాయ గణన ప్రక్రియ మూడు రోజుల కిందట పూర్తయింది. అయినా ఏఈవోలు పంటల నమోదు ప్రక్రియపై దృష్టి సారించ లేదు. అంతేకాకుండా గ్రామాల్లో పంటల నమోదుకు వీఆర్ఏలు అందుబాటులో లేకపోవడంతో పంటల సాగు వివరాల సేకరణకు ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పంటలను పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

గడువులోగా బుకింగ్ చేయిస్తాం

వానాకాలం సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఆన్‌లైన్ చేస్తేనే పంటకు మద్దతు ధర లభిస్తోంది. ఆరుతడి పంటలతో పాటు వరి పంటల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం. క్లస్టర్ల వారీగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పంటల వివరాలను ఆన్ చేయాలి. వ్యవసాయ గణన పూర్తయింది. గడువులోగా క్రాప్ బుకింగ్ చేయిస్తాం.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి

మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్యే గంగారాం

పిట్లం(జుక్కల్): ప్రభుత్వం 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గంగారాం డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. దీక్షలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగారాం మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తుందని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియమకాలు ఇస్తామని గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏదీ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే 25 వేల మెగా డీఎస్సీని వేయాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేటుకు ధీటుగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జంబిగే హన్మండ్లు, బోడ్ల రాజు, రాజశేఖర్ రెడ్డి, అడ్వొకేట్ రాంరెడ్డి, సొదాగర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో నాయకులతో కలిసి దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



సమ్మెలో కూర్చున్న డీఈవోలు

కామారెడ్డి రూరల్: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నోటికి నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ సత్యనారాయణ, మహిళ అధ్యక్షులు వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన డీఈవోల సమ్మె

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్ఎం స్కీం డాటా ఎంట్రీ ఆపరేటర్లు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మెలో ఆపరేటర్లు కూర్చున్నారు. తమకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఆపరేటర్లు బాలకృష్ణ, సిద్దార్థగౌడ్, అఖిల్‌గౌడ్, తదితరులున్నారు.



సమ్మెలో కూర్చున్న ఏఎన్ఎంలు

కొనసాగుతున్న ఏఎన్ఎంల సమ్మె

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని చేపడుతున్న ఏఎన్ఎం సమ్మె కొనసాగుతుంది. ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల వద్ద చేపడుతున్న సమ్మె వరసగా 18, 19వ రోజులకు చేరుకున్నాయి. నాయకుడు దశరత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనత బారిన పడొద్దు

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి

నాగిరెడ్డిపేట: గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

పిట్లం(జుక్కల్): గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఏఐఎంఎస్ కో–ఆర్డినేటర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించి పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలం ఆరేడ్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆరేడ్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ ఆహార వారోత్సవాలు నిర్వహించారు. తల్లి, బిడ్డల సంరక్షణ కోసం అంగన్వాడి కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోషణ ఆహారంపై ఆరోగ్య కార్యకర్తలు ఫర్హాన, సునీత అవగాహన కల్పించారు. సర్పంచ్ యాటకారి సంగమణి, అంగన్ వాడి టీచర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి



ఆరేడ్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యవర్గం

బాన్సువాడ: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యవర్గాన్ని శనివారం బాన్సువాడలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొల్ల గంగాధర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌చారి, ఉపాధ్యక్షులుగా సాయిలు, మేఘమాల, సంగ్రాం, కార్యదర్శిగా గంగారం, సహాయ కార్యదర్శులుగా సంగప్ప, రవీందర్‌నాయక్, సభ్యులుగా కిషన్, రమేష్, గంగామణి, సావిత్రిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకుల గంగాధర్, కోశాధికారిగా కాటిపల్లి లక్ష్మీకాంతం, కార్యదర్శిగా ఆనంపల్లి నరేందర్, సలహాదారులుగా ప్రభాకర్ గుప్తా, ఎల్.రాంచంద్రం తదితరులు ఎన్నికయ్యారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



బాన్సువాడ: పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని సీఐ మహేందర్‌రెడ్డి కోరారు. శనివారం మీనా గార్డెన్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కెమెరాల ఏర్పాటుతోనే నేరాలను అదుపు చేయవచ్చునని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కమిటీ వేసి, ఆ కమిటీ ద్వారానే ప్రధాన రహదారి వెంట కెమెరాలను ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు.

ఆధ్యాత్మికం..

సత్యనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని వీర వెంకట రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ క్రిష్టాజీరావు, ఏఎంసీ డైరెక్టర్ రవీందర్, నిట్టు నారాయణరావు, లద్దూరి లక్ష్మీపతియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్ ఆలయంలో లక్ష పుష్పార్చన



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్, తదితరులు ఉన్నారు.

జననేతకు ఘనంగా నివాళులు



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



గాంధారిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

జిల్లాలో పలు చోట్ల దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ..రైతు శ్రేయస్సే లక్ష్యంగా వైఎస్ఆర్ పాలన సాగిందని, ప్రతి నాయకుడు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగంపేటలో ..



భిక్కనూరులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



పిట్లంలో..

తీర్మానాలు చేస్తున్న సర్పంచులపై ఫిర్యాదు

బాన్సువాడ/కామారెడ్డి క్రైం : తీర్మానాలు చేసి ఒక పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు కొందరు సర్పంచులు వ్యవహరిస్తున్నారని, ఆయా గ్రామాల సర్పంచులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా ఎన్నికల అధికారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ప్రకారం ఎన్నికల్లో ఓటు ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే హక్కును కొంతమంది సర్పంచులు కాలరాస్తున్నారని అన్నారు. నాయకులు ఖలేక్, హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, మంత్రి గణేష్, నార్ల రఘు, తదితరులు ఉన్నారు.



ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అనుమతిలేని మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

భిక్కనూరు: అనుమతిలేని మందులు, నిద్రమాత్రలను డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కామారెడ్డి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలోని అన్ని మెడికల్ షాపులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు, నిషేధిత మందులను విక్రయించవద్దని సూచించారు. వినియోగదారులకు కొనుగోలు చేసిన ప్రతి మందుకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, కాలపరిమితి దాటిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దన్నారు.



తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ఎన్నికల గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ ఆదిస్వామి

– అదనపు కలెక్టర్ మను చౌదరి

పిట్లం(జుక్కల్): 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ లిస్టులో తప్పులుంటే సరి చేసుకోవాలన్నారు. ఓటు నమోదు చేసుకునేవారు స్థానిక బీఎల్వోల దగ్గరకు ఆధార్ కార్డు, ఫొటో తీసుకెళ్లాలని సూచించారు. బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

నమూనా ఎన్నికలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం విద్యార్థులతో నమూనా ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. అభ్యర్థులుగా పోటీలో ముగ్గురు విద్యార్థులను ప్రకటించి గుర్తులను కేటాయించి ఎన్నికలు జరిపించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విద్యార్థులు వివిధ వేషధారణలో వచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కు వచ్చిన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంల ప్రదర్శన నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓటును వినియోగించు విధానం గురించి యువతీ, యువకులకు వివరించారు. అలాగే పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

రామారెడ్డిలో..

రామారెడ్డి: ఓటరుగా నమోదు చేసుకోవడానికి యువత ముందుకు రావాలని రామారెడ్డి పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. రామారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఓటర్ నమోదు ప్రక్రియను నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగిరెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను శనివారం స్థానిక తహసీల్దార్ మహేందర్ కుమార్ పరిశీలించారు. నూతన ఓటరు నమోదుతోపాటు ఓటరు జాబితాలో సవరణల కోసం వచ్చిన దరఖాస్తులు వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

సంక్షిప్తం

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త కాశయ్య అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పతకం సతీశ్ అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కలిగోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జాజాల సురేందర్‌ను అధిష్టానం ప్రకటించడంతో తుక్కోజివాడి గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఉప సర్పంచ్ సంగారావు, బీఆర్ఎస్ నాయకులు మధుపట్ల రాజు, ఎంపీటీసీ జయశ్రీ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలవాలని పూజలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కామారెడ్డిలో సీఎం కేసీఆర్, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్ భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఉప సర్పంచ్ వంకాయల రవి, జాజాల సురేందర్ యువసేన ఆధ్వర్యంలో మత్తడిపోచమ్మ తల్లికి ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రవి మాట్లాడుతూ...గత 15 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపిన ఘనత కేవలం ఎమ్మెల్యే సురేందర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో గెలువగానే మత్తిపోచమ్మ ఆలయం నుంచి శ్రీ వేములవాడ రాజన్న ఆలయం వరకు ఎడ్లబండ్లపై రథయాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

భిక్కనూరు: బస్వాపూర్‌లో శ్రీరంగం ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. 459 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు బాలురాజు, భావన, హేమ, రాజు, రిశాద్, స్వప్న పాల్గొన్నారు.

జవాన్‌గా ఎంపికైన విద్యార్థికి సన్మానం

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకుని సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికైన దుర్గారెడ్డి అనే విద్యార్థిని శనివారం కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి.. దుర్గారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వసంత్‌కుమార్, శ్రీనివాస్, రాజు, రజిత, ఆసియా పర్వీన్, గంగారాం, సరిత, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

మద్నూర్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు శనివారం నిరసన చేపట్టారు. కళాశాలలో 240 మంది విద్యార్థులు ఉన్నారని, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయట అవసరాలను తీర్చుకుంటున్నామని వాపోయారు. ప్రహరీ, గదులు లేకపోవడంతో పాములు మధ్య పాఠాలు వింటున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యా శాఖాధికారులు స్పందించి సమస్యను తీర్చాలని కోరారు. విద్యార్థుల పక్షాన ఎంఎస్‌యూ నేత బాలు యాదవ్ డిమాండ్ చేశారు.